
# విషవలయం

జె. శ్యామల



దినకరుడు దినచర్య ముగించి వెనుదిరిగే వేళ... కాలుష్యపు కోరల్లో చిక్కిన సాయంకాలాన్ని కళ్ళారా చూడలేక, మందేకళ్ళను రెప్పలతోనే ఓదారుస్తూ, అప్పటిదాకా ఆలోచనల జామ్‌లో ఇరుక్కున్న మన సును బలమంతా ఉపయోగించి అదుపుచేసి, పక్కకు లాగి ఇంటిముఖం పట్టింది మైథిలి.

ఆహ్లాదనగర్ బోర్డు దుమ్ము కొట్టుకుపోయి కనిపించింది. నడుస్తూ ఉంటే రోడ్డుకు అటూ, ఇటూ కుప్పలుకుప్పలుగా చెత్త. ఎక్కడ చూసినా ప్లాస్టిక్ కవర్లు, బాటిల్స్, ప్లాస్టిక్ గ్లాసులు వగైరాలు.

జన్మభూమి పేరిట పెట్టిన చెట్లు కూడా కళావిహీనంగా ఆలనా, పాలనా లేక..వాటికి సైతం ప్లాస్టిక్ కవర్లు వేళ్లాడుతూ..

'థూ' నడిమధ్యలో ఉమ్మేస్తూ ఒక పాదచారి.

నిస్సిగ్గుగా నలుగురు నడిచే బాట అని కూడా విస్మరించి రోడ్డుకిరువైపులా మూత్ర విసర్జన చేస్తోన్న పురుషులు..

'ఛీ,ఛీ' మైథిలి మనసులోనే చికాకు పడింది. వద్దన్నా ముసురుకునే ఆలోచనలు ఆమెకు మరింత అలసటను కలిగిస్తున్నాయి.

అంత విసుగులోనూ 'ఇఫ్ యు పాస్ యూరిన్, డోంట్ పాస్' ఎక్కడో చదివిన భాషా దోషాలతో కూడిన ఇంగ్లీషు హెచ్చరిక గుర్తుకొచ్చి నవ్వొచ్చింది. ఎదురుగా ఎవరో వస్తుండటం గమనించి నవ్వునదిమి పట్టింది.

వీధికుక్క స్పీడుగా ఎదురొచ్చింది. మైథిలి పక్కకు తప్పుకుంది. కుక్కా సరిగ్గా అదే చేసింది. మైథిలి మళ్ళీ అటు జరిగింది. కుక్కా అంతే.

అచ్చు మనిషిలాగే ప్రవర్తించిన దాన్ని చూసి మైథిలి ఒకింత ఆశ్చర్య పోయి, కదలకుండానిల్చుని 'పోతల్లీ' అంది.

అది అర్థం చేసుకున్నట్లుగా వెళ్ళిపోయింది.

ఇల్లురానే వచ్చింది. అలవాటుగా చేయి బెల్‌మీదకు పోయింది.

పాప ఆకాంక్ష వచ్చి గేటు తీసింది.

"హాయ్ మామ్" అంటూ మంచినీళ్ళందించింది.

"లెటర్స్ ఏమైనా వచ్చాయా?" రోజూవారి డైలాగ్ కొట్టింది మైథిలి.

"ఆఁ ఆ. ఫోన్ బిల్లు ఆరొందలు వచ్చింది. పొద్దునేమో కరెంటువాడు రీడింగ్ చూసి పన్నెండొందలు బిల్లేసి ఇచ్చాడు. మనీబ్రదర్ బ్యాంక్ వాడే మో పే అమౌంట్ ఆరువేలైనా, ప్రస్తుతానికి ఐదొందలు కట్టండీ" అంటాడు ఆయాసంగా ఆగింది ఆకాంక్ష.

"హు" దీర్ఘంగా నిట్టూర్చింది మైథిలి.

"అరేయార్. ఫిర్‌మిలేంగే" బైట ఆశయ్ గొంతు.

"అదుగో, అన్న కూడా వచ్చేశాడు" అంటూ మైథిలి లేచి కాళ్ళూ, చేతులూ కడుక్కొని వంటింట్లోకి వెళ్లింది. 'టీ'కి నీళ్ళు పడేసి, టీపొడి అందుకుంది. దాన్ని చూసి 'ఇంకో రెండురోజుల్లో నిండుకుంటుంది' అనుకుంది.

"శుభాకాంక్షలూ! ఆ రిమోట్ ఇటివ్వు" ఆశయ్ అన్నాడు. ఆ సినిమా వచ్చి నప్పటినుంచీ ఆశయ్ చెల్లినలాగే పిలిచి ఆటపట్టిస్తుంటాడు.

"నేనివ్వను. నేను 'జీ'యే చూస్తాను" అంటోంది ఆకాంక్ష.

"నాకు బి ఫోర్‌యు కావాలి. కావాలంటే ఓ అరగంటాగి నీ ఇష్టమొచ్చింది పెట్టుకో" ఆశయ్ గట్టిగా అన్నాడు.

"నో,నో" ఆకాంక్ష.

"యు డోంట్ నో" ఆశయ్ అల్లరిగా.

"ఇద్దరూ ఆపండి. తేజ న్యూస్ పెట్టండి, ముందు ఈ టీ తాగండి" అంది మైథిలి.

"ఏంటి మమ్మీ నువ్వు కూడా" ఇద్దరూ సణిగారు.

అంతలో ఫోన్ రింగయింది. మైథిలి అందుకుని "హలో" అంది.

"మైథీ! మా సాగర్ ఈపూట ఇక్కడే ఉండమని గొడవచేస్తున్నాడు. అసలు నిన్ను, పిల్లల్నీ కూడా ఎందుకు తీసుకురాలేదని పోట్లాడుతున్నాడు. అందుకే నేను ఈ పూటకి ఇంటికిరాను. నా ఆబ్సెన్స్‌లో తల్లీ, పిల్లలు ఎన్జాయ్. పున ర్దర్శనం రేపటి శుభోదయానే. ఉండనా మరి"

"ఆఁఆ.. మీరు కూడా ఆనంద 'సాగరం'లో మునిగితేలండి. బై" మాటకు మాట అప్పజెప్పి ఫోన్ పెట్టేసింది మైథిలి.

"ఏంటి మమ్మీ" ఆశయ్ అడిగాడు.

"ఏముందీ, వి.ఆర్.యస్. తీసుకున్నప్పటినుంచీ మీ నాన్నకేం తోచట్లా.

ఊరంతా గాలించి మరీ ఫ్రెండ్స్‌ని పట్టుకుంటున్నాడు. చిన్ననాటి ఫ్రెండ్ సాగర్ అనే ఆయన అడ్రస్ తెలిసిందట. ఈరోజు వెళ్తానని పొద్దునే చెప్పాడు. ఇప్పుడక్కడినుంచే ఫోన్‌చేయటం. ఈపూట అక్కడే ఉంటారట" చెప్పింది మైథిలి.

"ఆహాఁ నేను సెల్ కొనుక్కుంటానని అడగాలనుకున్నానే, రేవటికి వాయిదా అన్నమాట" ఆశయ్ అన్నాడు.

"నేను స్కూటీ అడగాలనుకున్నా" ఆకాంక్ష అంది.

"నాకు నువ్వు పోటీనా. సెల్ ఎంతవుతుందని? స్కూటీ అంటే మాటలు కాదు" అన్నాడు ఆశయ్.

"మాటలు కాదు, ఆటలు" వెక్కిరించి, నీకంటే బైక్ ఉంది కాబట్టి అది అడగట్లేదు. నాకొద్దామరి" అంది ఆకాంక్ష.

"ఇద్దరూ ఆపండి గోల. ఓ గంట చదువుకోండి. బయటచూస్తే ప్రతిచోటా కాంపిటిషన్. చదువు అశ్రద్ధచేస్తే ఆ తర్వాత విచారించాల్సి ఉంటుంది" మైథిలి ఇంకా కొనసాగించేదే..

"సరే మమ్మీ. నీవంటయ్యేలోగా చదివేస్తా. నువ్వుమాత్రం మాకిష్టమైన బిర్యానీ చేసెయ్. ప్లీజ్ మామ్"గోముగా అంటూ టాపిక్ మార్చాడు ఆశయ్.

"అవును మమ్మీ" అన్నకు సపోర్ట్ చేసింది ఆకాంక్ష.

"ఓ.కె.అగ్రీడ్" అంటూ లేచింది మైథిలి.

** ** **

పిల్లలిద్దరూ పడుకున్నారు. మైథిలికి పుస్తకం చదువుతూ పడుకోవటం అలవాటు. ఈరోజెందుకో చేతిలో పుస్తకం ఉన్నా దృష్టి దానిమీద లేదు. ఆలోచన.. శ్రీరామ్, ఫ్రెండ్‌తో హాయిగా కబుర్లు చెబుతుంటాడు. వి.ఆర్.యస్. తీసుకున్నాక శ్రీరామ్‌కు ఖచ్చితమైన టైమ్‌టేబుల్ లేకుండా పోయింది. ఏం పరిస్థితుల్లో ఏమో, మొన్నటివరకూ దేశంలో మంచిపేరున్న 'అన్‌మోల్ ఘడీ' కంపెనీ అనుకోనట్లుగా పతనావస్థకు చేరుకుంది. ఫలితంగా సిబ్బందికి వి.ఆర్.యస్.పథకం అమలు. ఇప్పుడు మళ్ళీ ఉద్యోగమెక్కడ దొరుకుతుంది? చిన్నాచితక ఉద్యోగం చేయటం అతనికి నచ్చదు. 'పదిహేను వేలు తెచ్చుకున్నవాణ్ణి. ఆఫ్టాల్ మూడువేలకు, నాలుగువేలకు పొద్దున్నుంచీ, సాయంత్రం వరకూ పనిచేయటం నావల్లకాదు' అంటాడు. బిజినెస్ చేయటం అతని మనస్తత్వానికి కుదిరేపనికాదు. ఉన్న డబ్బునే ఒక ప్లాన్‌తో వాడుకుంటూ బతకాలనీ, త్వరలో పిల్లలు ఉద్యోగస్థులవుతారనీ అతని ఆశ. తనదేమో ప్రైవేట్ ఉద్యోగం. ఉండొచ్చు, ఊడొచ్చు. నెలాఖరులో ఇచ్చే జీతానికి చకోరంలా ఎదురు చూపులు. జీతం తక్కువే అయినా మెదడుకు వ్యాయామమని చేస్తున్న ఉద్యోగం. ప్రస్తుతం చదువులు చూస్తే ఏం చదివితే ఏం ఉద్యోగాలొస్తాయన్నది అయోమయమే. డబ్ల్యు.టి.సి.పై దాడి మాటేమోగానీ ఇండియాలో సాఫ్ట్‌వేర్ రంగం చతికిలపడి ఎందరి ఆశలమీదో నీళ్ళుచల్లింది. అయినా ఛాలెంజింగ్‌గా పనిచేయాలనుకుంటున్నారా? అయితే ఈరోజే రండి. అంటూ ప్రకటనలు. వివరంగా చదివితే వందరూపాయల అప్లికేషన్ తీసుకుని, రాతపరీక్ష రాయండి. అంతా అయ్యాక 'కండిషన్స్ అప్లయ్' అని చిన్న అక్షరాలు కనిపిస్తుంటయ్. వాటి అంతరార్థం ఆశయ్ ఈమధ్యే చెప్పాడు. 'యాభైవేలు, ఇంకా ఆపైన డబ్బు కట్టాలని, కడితే, ట్రెయినింగ్ సక్సెస్‌ఫుల్‌గా పూర్తిచేస్తే ఉద్యోగం'. అప్పటిదాకా ఆ సంస్థ ఉనికి అనుమానమే.

'ఆసక్తిని బట్టి చదువు' అని ఆదర్శాలు వల్లించినా కూడుపెట్టని చదువుపై ఎవరికి ఆసక్తి? ఎక్కడ చూసినా లక్షలు,కోట్లు.. అమెరికా పోవటాలు..డాలర్ల బాబుసరులు..పైనుంచి కిందివరకు అవినీతి మెట్లు. కొందరు పైకి, కొందరు కిందికి.. ఎటుపోతోందీలోకం?" మైథిలి ఆలోచనల్లో ఎన్నో ప్రశ్నలు. జవాబులు దొరక్కుండానే మెల్లగా నిద్రలోకి జారుకుంది.

** ** **

మరో రెండు నెలలు గడిచాయి.

మైథిలి సంసారాన్ని ఆర్థిక సమస్యలు అతలాకుతలం చేస్తున్నాయి. ఆదివారం. దోసెపిండి రుబ్బుదామంటే తిరగనని మొరాయించింది మిక్సీ. చేసేది లేక బజార్లో రుబ్బించుకురమ్మని ఆశయ్‌ని పంపింది.

"కరెంటుబిల్లు పన్నెండొందలు. రెండు నెలలుగా ఇలాగే వస్తోంది. ఎలా కడతాం? స్టవ్‌మీదే నీళ్ళు కాచుకోండి. వాషింగ్ మెషిన్ కూడా వాడొద్దు. ఎవరి బట్టలు వాళ్ళే ఉతికేసుకోండి" చెప్పాడు. అందరికీ చేదుగా అనిపించింది. "చదువు కునే పిల్లలు వాళ్ళేం చేస్తారు. మళ్ళీ భారం తనపైనే" మైథిలి అనుకుంది.

మైథిలి స్మృతిపొర కదిలింది. "పెళ్లయిన కొత్తల్లో అద్దింట్లో ఉండే రోజుల్లో ఆడ,మగ సమానమేనని, పిండి ఎందుకు రుబ్బవని శ్రీరామ్‌తో తను తగవు పడేది. 'అబ్బా! ఆరోటి ముందు కూర్చొని గుండమ్మకథలో ఎన్.టి.ఆర్.లా రుబ్బటం కష్టమే. ఓ పనిచేద్దాం. ఒక మిక్సీ కొనుక్కుందాం. అప్పుడయితే నేనే రుబ్బుతా' అనేవాడు.

'ఎంతకష్టమో' వెక్కిరించేది తను.

అలా ఈ మిక్సీ ఇంట్లో చేరింది. ఇద్దరూ ఉద్యోగస్థులే కావటంతో ఇద్దరికీ టైమ్ సరిపోయేదికాదు.

కిరోసిన్ స్టవ్‌తో వేగలేక కొన్నిరోజులు. ఆపైన గ్యాస్‌స్టవ్. ఇప్పుడయితే కిరోసిన్‌మాట అంతగా వినపడటంలేదు. అందులోనూ సిఎంచంద్రబాబు పథకంతో గ్యాస్‌స్టవ్ కామన్ అయిపోయింది.

అప్పట్లో ఇద్దరి జీతం లెక్కచూసుకుని ఇన్‌స్టాల్‌మెంట్‌లలో వస్తువులు తీసుకున్నారు. కొన్నిటికి బ్యాంక్ లోన్లు తీసుకున్నారు. ఇంట్లో కూర్చుని ప్రపంచ వీక్షణం చేయవచ్చుని, సినిమాల ఖర్చు కూడా తగ్గుతుందని టి.వి., ఆపైన రంగుల మోజుతో కలర్ టి.వి., కేబుల్ కనెక్షన్ వగైరా.. బట్టలు ఉతుక్కోవటం కష్టంగా ఉందని వాషింగ్ మెషిన్.. సీరియస్‌గా పొదుపుచేస్తూ ఉండటానికో గూడని ఓ ఫ్లాట్ అమర్చుకోగలిగారు.

అంతలో "మమ్మీ. ఇదుగో" అంటూ ఆశయ్ ఆలోచనల గొలుసు తెగ్గొట్టాడు.

"ఆఁ" అంటూ లేచింది మైథిలి.

"అమ్మలూ! ఉల్లిపాయ కట్‌చెయ్ కొంచెం" ఆకాంక్షకు చెప్పి, స్టవ్‌మీద నాన్‌స్టిక్ పాన్ పడేసింది.

అంతా దోసెలు తింటుండగా శ్రీరామ్ చెప్పాడు..

"రేపట్నుంచీ, కాదుకాదు, ఇవాల్టి నుంచీ గీజర్ వేయొద్దు"

మైథిలికి వెంటనే అర్థమైంది. 'కరెంట్‌బిల్లు పెరిగిపోయిందిగా' అనుకుంది.

"ఏఁ?" చలిని తలుచుకుంటూ ప్రశ్నించారు పిల్లలు.

"కరెంటుబిల్లు పన్నెండొందలు. రెండు నెలలుగా ఇలాగే వస్తోంది. ఎలా కడతాం? స్టవ్‌మీదే నీళ్ళు కాచుకోండి. వాషింగ్ మెషిన్ కూడా వాడొద్దు. ఎవరి బట్టలు వాళ్ళే ఉతికేసుకోండి" చెప్పాడు.

అందరికీ చేదుగా అనిపించింది. "చదువుకునే పిల్లలు వాళ్ళేం చేస్తారు. మళ్ళీ భారం తనపైనే" మైథిలి అనుకుంది.



"మ్యూజిక్ సిస్టమ్ అయినా, ఏదైనా లిమిట్‌గానే వాడండి. లైట్లు సరేసరి" సీరియస్‌గా చెప్పాడు శ్రీరామ్.

తమ కోర్కెల చిట్టా విప్పాలనుకున్న ఇద్దరు పిల్లలూ గప్‌చుప్ అయిపోయారు.

"సరేసరే ఈ కాఫీ తాగండి" అంది మైథిలి.

ఆమె అలా అందంటే "మరీ ఎక్కువగా సమస్యలు చెప్పి పిల్లల్ని వర్రీ చేయెుద్దు" అన్నదని శ్రీరామ్‌కు తెలుసు. అందుకే వెంటనే పేపరందుకున్నాడు.

టి.వి. ఆన్ చేసింది. అక్షయ బ్యాంక్ ముందు బారులు తీరిన జనం, గొడవ, కళ్ళ వత్తుకుంటున్న వాళ్ళు, బోరున ఏడ్చేస్తున్న వాళ్ళు, విలేకరులకు ఆవేశంగా, ఆవేదనగా తమ గోడు వెళ్ళబోసుకుంటూ.. 'జీవనసంధ్య'లో చిమ్మచీకట్లు ఆవరించగా అసహాయంగా, అనంతంలోకి చూస్తూ నిలబడి పోయింది మైథిలి.

** ** **

మనీబ్రదర్ బ్యాంక్ వాడి దగ్గర్నుంచీ వచ్చిన 'పే అమౌంట్' చూసి హతాశుడయ్యాడు శ్రీరామ్.

సాయంత్రం పిల్లలిద్దర్నీ దగ్గరకు పిలిచాడు.

"మీకు సప్లిమెంట్ కార్డులిచ్చింది అత్యవసరమయితే వాడుకోవచ్చని. ఇలా హోటళ్లు, పార్టీలు అంటూ తగలేస్తే కట్టడం ఎట్లా? ఈనెల పదివేలు అమౌంట్ అయింది. కష్టం తెలుసుకుని ఖర్చు చేయాలి. తెలిసిందా? ఖర్చుచేసే ముందు ఏది అవసరం, ఏది అనవసరం అని ఓసారి ఆలోచించండి. కార్డేకదా అను కుంటే ఆరిపోతాం" యమ సీరియస్‌గా చెప్పాడు శ్రీరామ్.

"సారీ డాడీ" ఇద్దరూ తలొంచుకున్నారు.

విషయం తెలిసి మైథిలి మనసు బాధగా మూలిగింది. 'తనసలు ఈ క్రెడిట్ కార్డ్ గొడవ వద్దన్నది. కొన్నిచోట్ల క్రెడిట్ కార్డ్ అనగానే వెంటనే డీఫాల్టర్స్ లిస్ట్‌లో చెక్ చేసుకోవటం చూసి చికాకు పడింది. కానీ శ్రీరామ్ అదొక సౌకర్యమని, పద్ధతి ప్రకారం వాడుకుంటే ప్రయోజనం ఉంటుందనీ అనడంతో ఊరుకుంది. తీరా చూస్తేఇప్పుడిలా అయింది' అనుకుంది. 'నిద్రపోయి కలగన్నాను బతుకంతా సుందరమని, మేల్కొని గుర్తెరిగాను బతుకంటే బాధ్యతని' ఎక్కడో చదివిన సూక్తి గుర్తొచ్చి నిట్టూర్చింది.

రోజులు గడుస్తున్నాయి.

మైథిలి వాషింగ్ మెషిన్‌పై కవర్ కప్పింది. ఎవరికన్నా అమ్మేద్దామా అని అనుకున్నారు. కానీ సెకండ్ హ్యాండ్ అనేసి మరీ అలుసుగా అడగటంతో అలాగే ఉంచేశారు. గీజర్ చూస్తే అలంకార ప్రాయం.

ఫ్రిజ్‌ను ఇంకా వదల్లేకపోతున్నారు. మిక్సీని మాత్రం రిపేర్లు చేయిస్తూ వాడుతూనే ఉన్నారు.

ఆరోజు చికాగ్గా అనిపించి ఆఫీసునుంచి మధ్యాహ్నమే వచ్చేసింది.

తలనొప్పి మొదలైంది. ఫ్యాన్ వేసుకుందామని స్విచ్‌పై యథాలాపంగా వేలుంచింది. తిరగని ఫ్యాన్ చూసి కరెంట్‌కోతను గుర్తించింది. కాస్త రిఫ్రెష్ అయి దివాన్ మీద నడుంవాల్చింది. "సరిగ్గా పరీక్షల ముందు కరెంట్ కోత. లాంతర్లకు ఈతరం పిల్లలు అలవాటు పడలేరు. అబ్రహాంలింకన్‌ని ఆదర్శంగా చెప్పినా ఫలితమేముండదు. ఎమర్జెన్సీ లైట్లు చెప్పినంత గొప్పగా పనిచేయవు. కొద్దిసేపటికే డౌనవుతయ్. ఎలా గడుస్తాయో రోజులు. ఊళ్ళో ఉన్న ఆడబడుచు సకాలంలో వానలు పడక, కరెంటు లేక, నీరందక పంట నష్టపోవడంతో వాళ్ళని ఆదుకోవలసి వచ్చింది. పట్నంలో పచ్చగా ఉంటారని తమగురించి వాళ్ళ భావన. పైగా తను కూడా సంపాదిస్తుంది కాబట్టి సమస్యలుండవనుకుంటారు.

శ్రీరామ్‌లో ఉత్సాహం తగ్గింది. ఆందోళన. దాన్ని సర్దుకోవడానికి కస్సు,బుస్సు.. ఈమధ్యే అయిదువేల జీతానికి నచ్చకపోయినా ఓ ఉద్యోగంలో చేరాడు. పిల్లలకి లోకం కొద్దిగా తెలుస్తోంది. ఆశయ్ చదువు ఏటితో అయిపోతుంది. మంచి ఆశయాలతో ఆదర్శంగా ఉండాలని వాడికాపేరు పెట్టింది. వాడి భవిష్యత్తు ఎలా ఉందో?" అలసటతో మైథిలికి మాగన్నుగా నిద్రపట్టింది.

** ** **

"ఏమిటీ? దివాలానా? ఇప్పుడెలా?, ఉహుఁ ఇవాళ మాకు బాయ్ పేపర్ వేయలేదు. అరె. నేనిప్పుడే వస్తున్నా" వివర్ణమైన మొహంతో బాధగా, భయంగా ఉన్న శ్రీరామ్ మొహం చూసి మైథిలికేం అర్థం కాలేదు.

"ఏమైంది. ఎందుకలా అయ్యావు. పేపరంటావ్, దివాలా అంటావ్. ఏమైంది?" అడిగింది మైథిలి.

ఓపిక లేనట్లుగా కుర్చీలో కూలబడ్డాడు శ్రీరామ్.

మైథిలి మంచినీళ్ళందించింది.

శ్రీరామ్ తీసుకోలేదు. "నేను పొరపాటు చేశాను మైథీ" అన్నాడు.

"ఏం పొరపాటు" అయోమయంగా అడిగింది మైథిలి.

"సాగర్ చెప్పాడని నాకొచ్చిన డబ్బులో ఓ లక్ష 'అక్షయ' బ్యాంకులో వేశాను. బ్యాంకు దివాలా తీసిందట. తాళాలేశారట. అసలు వాళ్ళు పత్తా లేరట" మెల్లగా చెప్పాడు శ్రీరామ్.

"అయిందీ, నేను చెబుతూనే ఉన్నాను, ఎక్కడంటే అక్కడ వేయెుద్దని. వడ్డీకాశపడితే అసలుకే మోసం వచ్చింది. లక్షరూపాయలు మళ్ళీ సంపాదించటం మాటలా?" ఆవేశంగా అంది. అంతలోనే శ్రీరామ్ మొహం చూసి ఆగిపోయింది.

"పోన్లే. ఏంచేస్తాం. నువ్వు ధైర్యంగా ఉండు. ఏం వర్రీకాకు" ధైర్యం చెప్పింది.

"వర్రీ అయి చేసేదేముంది? ఓసారి వెళ్ళొస్తాను" అంటూ బయల్దేరాడు శ్రీరామ్.

అలాగే చూస్తుండిపోయింది మైథిలి.

పైకి అందే కానీ అది తమకెంత దెబ్బ? పిల్లల చదువులు, భవిష్యత్తు?



వాళ్ళ ఆశలు, ఆనందాలు.. ఆకాశాన్నంటే ధరలు.

ఊడే ఉద్యోగాలు, పుట్టని ఉద్యోగాలు.

ఎటుచూసినా దగా, దివాలా.

రోజురోజుకీ 'విష'మిస్తున్న పరిస్థితులు.

టి.వి. ఆన్ చేసింది. అక్షయ బ్యాంక్ ముందు బారులు తీరిన జనం, గొడవ, కళ్ళ వత్తుకుంటున్న వాళ్ళు, బోరున ఏడ్చేస్తున్న వాళ్ళు, విలేకరులకు ఆవేశంగా, ఆవేదనగా తమ గోడు వెళ్ళబోసుకుంటూ..

'జీవనసంధ్య'లో చిమ్మచీకట్లు ఆవరించగా అసహాయంగా, అనంతంలోకి చూస్తూ నిలబడిపోయింది మైథిలి.

వేలు పెట్టుబడి పెట్టి శ్రీరామ్ కొన్న ల్యాండ్ చట్టపరమైన వివాదాల్లో ఉందనీ, ఆశయ్ కోర్సుకు కట్టిన నలభైవేలు బూడిదలో పోసిన పన్నీరే అన్న చేదునిజాలింకా ఆమెకు తెలియదు.

ఆమెలో ఒకటే ఆలోచన...ప్రస్తుత వ్యవస్థలోని అస్తవ్యస్థత వల్ల ఏర్పడిన ఈ 'విషవలయం' నుంచి ఎలా బయటపడటం? ఏది దారి? ప్రభుత్వ విధానాలకూ, కుటుంబ మనుగడకూ సంబంధమెంత దగ్గరో మనోనేత్రం ముందు 70ఎం.ఎం.లో కనిపించింది. ఎంతమంది ఎన్నిరకాలుగా ఈ ఊబిలో కూరుకుపోతున్నారో అన్న ఆలోచన ఆమెను వణికించింది. మెదడు బూజు దులుపుకుంది. ఆలోచన చైతన్యాన్ని నింపుకుంది. తన చైతన్యంతో మరికొంతమందిని జాగృతం చేయాలని డ్యూటీలో ఉన్న దివాకరుడి సాక్షిగా నిశ్చయం చేసుకుంది మైథిలి. ●